నా కఠోర సాధన, శ్రమ ఫలితంగా 2015లో రాష్ట్ర, 2016లో జాతీయ జూనియర్ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచా. అదే ఏడాది విజయవాడలో జరిగిన ఏజీటీఏ 50కే టోర్నీ ఓపెన్ కేటగిరీలో 15 ఏళ్ల వయసులోనే టైటిల్ కైవసం చేసుకున్నా. ఇక అక్కడ నుంచి వయసుతో సంబంధం లేకుండా జూనియర్ కాకుండా సీనియర్ విభాగంలోనే ఎక్కువగా ఆడడం ప్రారంభించా. మరోవైపు ఇంటర్మీడియేట్ పూర్తయింది. జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతున్నా. ఇక్కడ నుంచి మరో మెట్టు ఎక్కాలంటే ఏం చేయాలనే ఆలోచన మొదలైంది. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలు ఉచిత విద్యతో పాటు టెన్నిస్‌లో మంచి శిక్షణ కూడా ఇస్తాయని తెలిసింది. టెక్సాస్‌లోని శామ్ హౌస్టన్ యూనివర్సిటీని సంప్రతించాం. వీసా దరఖాస్తుకు కావల్సినంత డబ్బు మా దగ్గర లేదు. నాన్న స్నేహితులు సుబ్రహ్మణ్యం, నీరజ్ కేడియా, మా బంధువులు కొందరు సాయం చేశారు. అందులో సీటు లభించాలంటే అంతర్జాతీయ పోటీలు ఆడిన అనుభవం ఉండాలి. దాని కోసం అదే నెలలో రెండు టోర్నీల్లో ఆడా. ఒక టోర్నీలో క్వార్టర్స్ వరకు వెళ్లా. రెండుసార్లు తిరస్కరణ తరువాత వీసా లభించింది. అప్పటివరకు ఇంట్లోవాళ్లను వదిలి ఎక్కడికీ వెళ్లలేదు. అలాంటిది వేరే దేశం వెళ్లాలంటే ధైర్యం చాల్లేదు. మా అమ్మ సుప్రియ నన్ను ప్రోత్సహించింది. కోచ్ ప్రహ్లాద్ సార్ కిట్ కొనిచ్చారు. అలా తొలిసారి విమానం ఎక్కాను.

అదే లోకం...

అమెరికా వెళ్లాక టెన్నిస్ తప్ప మరో ధ్యాస లేదు. అందరూ మూడు నాలుగు గంటలు సాధన చేస్తే, నేను ఐదారు గంటలు కష్టపడ్డా. నా పట్టుదల చూసి అక్కడున్న కోచ్‌లు నా గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శిక్షణలో భాగంగా విదేశీ క్రీడాకారిణులతో ఆడడంవల్ల నైపుణ్యం పెరిగింది. శామ్ హౌస్టన్ యూనివర్సిటీ తరఫున వివిధ పోటీల్లో పాల్గొని 10కి పైగా ట్రోఫీలు నెగ్గా. వరుసగా రెండేళ్లపాటు ఉత్తమ క్రీడాకారిణి అవార్డు సాధించా. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తిరిగి మన దేశానికి వచ్చా.

ఖర్చు ఏడాదికి కోటి...

అంతర్జాతీయ ర్యాంకింగ్‌ను మెరుగు పర్చుకోవాలన్నా, గ్రాండ్‌స్లామ్ వంటి టోర్నీల్లో పాల్గొనాలన్నా ఏడాదిలో కనీసం 25 టోర్నీల్లో ఆడాలి. ఇందులో నాలుగైదు పెద్ద టోర్నీల్లో గెలవాలి. అప్పుడే ర్యాంకింగ్ మెరుగవుతుంది. ఇందుకోసం ఏడాదికి నా శిక్షణ, విదేశాలకు ప్రయాణ ఖర్చులు, కోచింగ్ సిబ్బందికి కలిపి కోటి రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం టెక్‌వేవ్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ కొంతమేర సాయం చేస్తోంది. మిగిలిన వాటికి నాన్న కష్టపడాల్సి వస్తోంది. నా పరిస్థితిని గమనించి, ప్రభుత్వం చేయూతనందిస్తే మరిన్ని టోర్నీల్లో ఆడే అవకాశం ఉంటుంది. ఏదిఏమైనా ప్రపంచ మేటి క్రీడాకారుల్లో ఒకరిగా ఎదిగి నాన్న కల నెరవేర్చాలన్నది నా ఆశయం."

- ఎస్ఎస్‌బి సంజయ్

వారి తరువాత నేనే...

ఇప్పటివరకు నాలుగు ఐటీఎఫ్ టైటిళ్లు సాధించా. అందులో లాస్‌ఏంజెల్స్ ఐటీఎఫ్ టైటిల్‌ను భారత క్రీడాకారిణుల్లో సానియా మీర్జా, కర్మాన్ కౌర్ తర్వాత గెలిచింది నేను మాత్రమే. గత ఏడాది ప్రతిష్ఠాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ (ఫెడ్ కప్)లో పాల్గొన్న భారత జట్టులో కూడా స్థానం సంపాదించా. ఈ ఏడాది భారత నంబర్ వన్ ర్యాంక్‌ను అందుకున్నా. అంతర్జాతీయ స్థాయిలో 1300కు పైగా ర్యాంక్‌తో మొదలై, కెరీర్ ఉత్తమ 284వ ర్యాంక్‌కు చేరుకున్నా. ఆస్ట్రేలియా, ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్ వంటి గ్రాండ్‌స్లామ్‌ల్లో ఆడాలంటే నా ర్యాంక్ 240 దిగువకు రావాలి. వచ్చే నెలలో దుబాయ్‌లో ఒక టోర్నీ ఉంది. అందులో గెలిస్తే జనవరిలో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం నా దృష్టి అంతా ఆ టోర్నీపైనే.



మిల్లెట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యం

- ఆ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి
- మిల్లెట్ నెట్‌వర్క్ ఇండియా సభ్యులు

జహీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం డిడిగి గ్రామశివారులోని డీడీఎస్-కేవీకే (డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ-కృషి విజ్ఞాన కేంద్రం)లో చిరుధాన్యాల చెల్లెళ్ల జాతీయ సదస్సు రెండవ రోజు బుధవారం కూడా కొనసాగింది. పది రాష్ట్రాలకు చెందిన 17 సంస్థల చిరుధాన్యాల చెల్లెళ్లు హాజరై తమ ప్రాంతాల్లో చిరుధాన్యాలసాగు విధానం, మార్కెటింగ్ తదితరాలపై పరస్పరం చర్చించుకున్నారు. రెండవ రోజు నిర్వహించిన సమావేశంలో చిరుధాన్యాల తగ్గుదలకు కారణాలు, సంరక్షణకోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, మార్కెట్ వాతవరణంలో మార్పులు తెచ్చే విధానం, చిరుధాన్యాల వినియోగం పెంచేవిధానం, నెట్‌వర్క్ సంస్థల సలహాలు, కేంద్ర ప్రభుత్వానికి చిరుధాన్యాలపై డిక్లరేషన్ తయారుచేసే విధానం తదితరాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్‌జీరంగా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డీన్ డా.విజయ ఖాదర్ మాట్లాడుతూ నిత్యం తీసుకునే ఆహారంలో పోషకలోపాలు ఉన్నాయని, దీన్ని అధిగమించేందుకు పోషక విలువలు మెండుగా ఉన్న చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాన్నారు. నేటి ఆధునిక పద్ధతులకు అలవాటు పడి బలవర్ధకమైన ఆహారాన్ని మరిచిపోయామన్నారు. పీచుపదార్థాలు, విటమిన్లు పుష్కలంగా లభించే మిల్లెట్స్‌ను తీసుకోవాలన్నారు.

చేజారిపోతున్న చిరుధాన్యాలను కాపాడుకుందాం

మిల్లెట్‌నెట్వర్క్ ఇండియా స్టీరింగ్ కమిటీ సభ్యురాలు సలోమి ఏసుదాసు మట్లాడుతూ చేజారిపోతున్న చిరుధాన్యాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ సహకారంతో చిరుధాన్యాల సాగును ముందుకు తీసుకుపోవాలన్నారు. చిరుధాన్యాలతోపాటు పప్పు ధాన్యాలను పండించాలన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ చిరుధాన్యాల చెల్లెళ్ల సమాఖ్య జాతీయ సదస్సు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఆయా రాష్ట్రాలకు చెందిన చిరుధాన్యాల చెల్లెళ్లు పాల్గొని వారి వారి ప్రాంతాల్లో సాగు, వినియోగం పెంచేలా చర్చించడ ఎంతో బాగుందన్నారు.



హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన పద్మశ్రీఅవార్డు గ్రహీత నేక్‌రాం శర్మను సన్మానిస్తున్న సభ్యులు

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

టేక్మాల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు వ్యక్తి నీటి మునిగి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం బర్దిపూర్‌కు చెందిన బంటు విఠల్(60) చేపల వేటకు మంగళవారం గ్రామ శివారులోని చెరువులోకి దిగాడు. విఠల్ కాళ్లకు తీగ చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. రాత్రి స్థానికులు మృతదేహానికి వెలికి తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నీటి కుంటలో పడి మహిళ..

పాపన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దుస్తులు ఉతికేందుకు వెళ్లిన మహిళ నీట మునిగి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం పాపన్నపేట గ్రామానికి చెందిన ఉప్పరి భవాని(36) కొన్నేళ్లుగా మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో భర్త విఠల్‌తో కలసి కూలీ పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటుంది. ఆమె ఈ నెల 4న గ్రామ శివారులోని కొత్తకుంట వద్దకు దుస్తులు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందింది. అయితే భవాని అప్పుడప్పుడు గాంధీ ఆస్పత్రికి వెళ్లి అక్కడే ఉండి మందులు తీసుకొని వచ్చేది. ఇప్పుడు కూడా వెళ్లిందేమోనని భావించిన కుటుంబ సభ్యులు మిన్నకుండిపోయారు. బుధవారం కుంటలో మృతదేహం కనిపించకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలి అన్న నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ. 60 లక్షల వార్షిక వేతనంతో
గీతం విద్యార్థినికి ఉద్యోగం

- కొనసాగుతున్న ప్రాంగణ నియామకాలు
- మరొకరికి రూ.51 లక్షల వార్షిక వేతనం..

అనూష, సమీనా

పటాన్‌చెరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి ప్రాంగణ నియామకాల్లో మరోసారి సత్తా చాటింది. బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని యర్రం అనూష అట్లాసియన్‌లో రూ.60 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగానికి ఎంపికైంది. అంతేగాక, తోటి విద్యార్థి కొర్రపాటి సమీనాతో కలిసి ఆమె మైక్రోసాఫ్ట్‌లోనూ రూ.51లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్ కొలువుకు ఎంపికైంది. సిలికాన్ ల్యాబ్ గీతం విద్యార్థి ఒకరిని రూ.22 లక్షల వార్షిక వేతనానికి ఎంపిక చేయగా, పెగా సిస్టమ్స్ ఏడుగురు విద్యార్థులకు రూ.15.48 లక్షలు, డెలివరూ ముగ్గురుకి రూ.12.07 లక్షలు, ఒరాకిల్ ఐదుగురికి రూ.10 లక్షలు, రిలయన్స్ జియో బీపీ ఒక విద్యార్థికి రూ.9 లక్షలు, డెలాయిట్ పీపీవో ఐదుగురికి రూ.8.64 లక్షలు, ఏషియన్ పెయింట్స్ ముగ్గురుకి రూ.8.5 లక్షలు, ఐసీఐసీఐ బ్యాంక్ 14 మందికి రూ.8.29 లక్షలు, నౌకరీ.కామ్ ఒక్కరికి రూ.7 లక్షలు, పీజీఎస్ ముగ్గురు విద్యార్థులకు రూ.8 లక్షలు, కీలూప్ ఆరుగురికి రూ.7.2 లక్షలు, వయాప్లస్ ఐదుగురికి రూ.7 లక్షలు, హెచ్ అండ్ ఆర్ బ్లాక్ నలుగురుకి రూ.5.27 లక్షలు, మ్యూసిగ్మా 17మందికి రూ.5 లక్షలు, ఈవై జీడీఎస్ 49 మందికి రూ.4.83 లక్షలు, యాక్సెంచర్ 92 మందికి రూ.4.5 లక్షలు, టెక్ మహీంద్రా 85 మంది విద్యార్థులను రూ.4 లక్షల వార్షిక వేతనానికి ఎంపిక చేశాయి. దీనిపై కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ విజయవంతమైన కెరీర్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడంలో గీతం ముందుందన్నారు.

జీఎన్ సాయిబాబా జీవితమే పోరాటం

- ఉపా చట్టం రద్దుకు పోరాడడమే నిజమైన నివాళి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దివంగత ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా జీవితమే పోరాటమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలో నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సాయిబాబా సంస్మరణ సభలో వారు పాల్గొని మాట్లాడారు. సాయిబాబా 57 ఏండ్ల జీవితంలో 37 ఏండ్ల పాటు అనేక ఐక్య సంఘాలు నిర్మించారని, అంతర్జాతీయంగా భారత ప్రజాఉద్యమాలకు మద్దతు కూడగట్టారన్నారు. ఆయన ఆంధ్రలో పుట్టినప్పటికీ తెలంగాణ కోసం కొట్లాడారన్నారు. దుర్మార్గమైన ఉపా చట్టాన్ని రద్దు చేసి పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఆయన ఆకాంక్షించారని, దాని కోసం పోరాడటమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. సాయిబాబా ఆశయాలను స్ఫూర్తిగా పుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్లు మేకల వీరన్నయాదవ్, ద్యాగల సారయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, నిర్బంధ వ్యతిరేక కమిటీ కోకన్వీనర్ రవిచందర్, లింగారెడ్డి, పౌరహక్కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

వర్గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టడంతో యువకుడు మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన యావపురం కిషన్‌గౌడ్(35) రంగారెడ్డి జిల్లా తుర్కపల్లిలోని ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి రాత్రి 1 గంటలకు తిరిగి వస్తుండగా తునికిఖాల్సా సమీపంలో రాగానే బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు మల్లేష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరికి మూడేళ్ల జైలు

వర్గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాల కేసులో ఇద్దరికి గజ్వేల్ న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర గ్రామానికి చెందిన జాదవ్ జైరామ్, రాథోడ్ ఆరు నెలల క్రితం వర్గల్ మండల పరిధిలోని గోవిందాపూర్, వేలూర్ గ్రామాల్లో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. టెక్నాలజీ సాయంతో పోలీసులు వారిని అరెస్టు చేసి చోరీ సొమ్మును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో 7 కేసులలో నేరం రుజువైనందున గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రియాంక వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

బైక్‌ల దొంగకు రిమాండ్

● ఐదు బైక్‌లు స్వాధీనం

గజ్వేల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌లను అపహరించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం రావెల్లికి చెందిన దండు ఠాగూర్(22) దుండిగల్‌లో ఓ బైక్, గౌరారంలో ఓ బైక్, గజ్వేల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు బైక్‌లను అపహరించాడు. ఈ విషయమై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఠాగూర్ తూప్రాన్‌లో ఉన్నాడని సమాచారం అందడంతో వెంటనే వెళ్లి పట్టుకున్నామన్నారు. అతని నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న సీఐలు సైదా, ముత్యరాజు, ఎస్ఐ శంకర్, క్రైమ్ పార్టీ సిబ్బంది యాదగిరి, నవీన్, రవి, నరేందర్, వెంకటేశ్, స్వామిలను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అభినందించారు.

దొంగతనం కేసులో వ్యక్తికి 14 రోజుల రిమాండ్

సిద్దిపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటో దొంగతనం కేసులో నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి బుధవారం తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామానికి చెందిన మండప గోపి తన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. అదే గ్రామానికి చెందిన మాట్ల రాజు ఆటో ఎత్తుకెళ్లాడని గుర్తించారు. ఈ మేరకు 24 గంటల్లో ఆటోను స్వాధీనం చేసుకుని, అతడిని కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చేర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం రాంపూర్ గ్రామం నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండలంలోని వేచరేణి గ్రామశివారు ఎల్లదాసునగర్ కాలనీకి చెందిన మోతె నరేశ్ ఆటోలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడులు చేపట్టి ఆటో పట్టుకుని సీజ్ చేశారు.

న్యూస్ బాక్స్

తక్కువ ధరలకే ఆర్టీసీ అద్దె బస్సులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పెండ్లిలు, శుభకార్యాల సీజన్ నేపథ్యంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నదని సిద్దిపేట ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ అన్నిరకాల అద్దె బస్సులపై భారీగా తగ్గిస్తూ, ప్రైవేటు వాహనాల కంటే తక్కువ ధరకే సంస్థ అద్దె బస్సులు ఇస్తున్నారని తెలిపారు.

'ప్రాథమిక పాఠశాలలు మూసేయడం సరికాదు'

కొండపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సర్వేకు కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను వినియోగించుకోవడం సరైనది కాదని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పొన్నమల్ల సత్యష్ణ, రామచంద్రం, అంజయ్య పేర్కొన్నారు. సర్వేకు కేవలం ప్రాథమిక ఉపాధ్యాయులకు కేటాయించి మధ్యాహ్నం పూట పాఠశాలలను మూసివేయడంతో విద్యకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. తక్కువ రోజుల్లో పూర్తయ్యేలా ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను సర్వేలో ఉపయోగించుకోవాలని కోరారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి: ఏబీవీపీ

హుస్నాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం హుస్నాబాద్ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పట్టణంలో విద్యార్థులు ర్యాలీ జరిపారు. అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించి ధర్నా చేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళన విరమించాలని చెప్పినా వినకపోవడంతో ఏబీవీపీ నాయకులను బలవంతంగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల ఆదిత్య, నగర కార్యదర్శి రాకేష్, చరణ్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

● సమగ్ర సర్వేకు సహకరించాలి
● ఓటరు నమోదును విజయవంతం చేయాలి
● గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ

ఇంటర్వ్యూ...



ఆర్డీవో చంద్రకళ

గజ్వేల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని, భూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ అన్నారు. ఆర్డీవోగా తనకు మొదటి పోస్టింగ్ అని, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో మమేకమై పని చేస్తూ ఆదర్శ డివిజన్‌గా మార్చేందుకు కృషిచేస్తానంటున్న ఆర్డీవో చంద్రకళతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

జవాబు: గజ్వేల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటా. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటా. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో సమన్వయంతో పనిచేసి పౌర సేవలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటా. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి మొదలుకుని తహసీల్దార్ వరకు అందరితో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు పౌరసేవల్లో ఇబ్బందులు లేకుండా చూస్తా.

ప్రశ్న: గతంలో ఎక్కడెక్కడ పనిచేశారు..?

జవాబు: మొదట మహబూబ్‌నగర్ జిల్లాలో రెండేళ్లు పనిచేశా. హైదరాబాద్ జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్‌గా పనిచేశా. ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ తహసీల్దార్‌గా పనిచేశా. గతేడాది ఆర్డీవోగా పదోన్నతి పొందిన అనంతరం స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని పబ్లికేషన్స్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేశా. తాజా బదిలీల్లో గజ్వేల్ ఆర్డీవోగా తొలిసారి పోస్టింగ్‌తో బదిలీపై వచ్చా.

ప్రశ్న: ప్రస్తుతం మీ ముందున్న లక్ష్యాలేంటి..?

జవాబు: ప్రస్తుతం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. ఈ ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని కోరుతున్నా. కుటుంబసభ్యులకు సంబంధించిన ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ధరణి పాసు పుస్తకాలు దగ్గర పెట్టుకుని ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు పూర్తి వివరాలను ఇవ్వాలి. అంతేకాకుండా వచ్చే శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి.

ప్రశ్న: గజ్వేల్ డివిజన్ ప్రజలకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా..?

జవాబు: గజ్వేల్ ఆర్డీవోగా ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు కృషిచేస్తా. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలకు అందాల్సిన పథకాలు, సేవలను త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తా. జిల్లా ఉన్నతాధికారులు, డివిజన్ పరిధిలోని క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ గజ్వేల్ డివిజన్ పరిధిలోని ప్రజలకు ఆదర్శమైన సేవలందించి గజ్వేల్‌ను ఆదర్శ డివిజన్‌గా మర్చేందుకు కృషిచేస్తా. ఇందుకు గజ్వేల్ డివిజన్ ప్రజలు సహకరిస్తారని కోరుకుంటున్నా.

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం



కొమురవెల్లి మండలం గురువన్నపేటలో సర్వే చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, అధికారులు

చేర్యాల/మర్కుక్/దుబ్బాక, మిరుదొడ్డి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబసర్వేను బుధవారం చేర్యాల, కొముర వెల్లి మండలాలలో ప్రారంభించారు. ప్రత్యేక అధికార బృందం ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని ప్రత్యేకపత్రంలో నమోదు చేశారు. అలాగే సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కాంగ్రెస్ కొమురవెల్లి మండల నాయకుడు, ఐనాపూర్ మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి అన్నారు. బుధవారం కొమురవెల్లి మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మర్కుక్ మండలంలో 16 గ్రామాలకుగాను 692 కుటుంబాలకు ఐదుగురు సూపర్‌వైజర్లు, 53 మంది ఇన్యుమరేటర్లతో సర్వే చేపట్టారు. వీరందరికీ మండల నోడ్ అధికారి తహసీల్దార్ అరిఫా పలు సూచనలు చేశారు. దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి గ్రామాల్లో ఎంపీడీవో భాస్కర్, మిరుదొడ్డి మండలంలోని ధర్మారం, మల్లుపల్లి గ్రామాల్లో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, అల్వాల్, చెప్యాల గ్రామాల్లో తహసీల్దార్ హరికిషన్, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని బేగంపేటలో తహసీల్దార్ చంద్రశేఖర్ సర్వేను ప్రారంభించారు. ధర్మారం, మల్లుపల్లి గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను డీఆర్డీవో పీడీ జగదేవ్‌ఆర్యా, బేగంపేటలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డిలు పరిశీలించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి: సీపీ



హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ అనురాధ

హుస్నాబాద్, అక్కన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి వారిచ్చే ఫిర్యాదును స్వీకరించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. బుధవారం హుస్నాబాద్, అక్కన్నపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలతో పాటు స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పనితీరు, వారికి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధి భౌగోళిక పరిస్థితులు, ముఖ్యమైన ప్రదేశాలు, పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయి, ఏవిధంగా నియంత్రణ చేయాలనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్‌బీ సీఐలు కిరణ్, శ్రీధర్‌గౌడ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



చిన్నకోడూరులో కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

చిన్నకోడూరు/సిద్దిపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి సూచించారు. బుధవారం చిన్నకోడూరు మండలంలోని మాచాపూర్, చిన్నకోడూరు గ్రామాల్లో, సిద్దిపేట రూరల్ మండలంలోని రావురూకుల గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, కంది, శనగ, ఉలువ, వేరుశనగ పంటలను శాస్త్రవేత్తల బృందం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు చిన్నకోడూరు రైతువేదికలో రబీలో వేసుకోవాల్సిన పంటల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రమాదేవి, డాక్టర్ పల్లవి, డాక్టర్ సరిత, ఏవోలు జయంత్‌కుమార్, నరేష్, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ ఫలితాలను సాధించాలి'

జగదేవ్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలను సాధించడానికి కృషిచేయాలని డీఐఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం జగదేవ్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులను తనిఖీ చేసి, కళాశాల ప్రాంగణం, తరగతి గదులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న మాట్లాడుతూ డీఐఈవో సూచనల ప్రకారం విద్యార్థులు ఉన్నతికి కృషి చేస్తామని తెలియజేశారు.

'సామర్థ్యాలను పెంపొందించాలి'

కుకునూరుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించే విధంగా బోధన సాగాలని ఎంఈవో బచ్చలి సత్తయ్య తెలిపారు. బుధవారం కోనాయిపల్ల, వడ్డెర కాలనీ కాషానగర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు.

మెళకువలు పాటిస్తే దిగుబడులు

● పట్టు పరిశ్రమశాఖ ఏడీ ఇంద్రసేనారెడ్డి

చిన్నకోడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టుపురుగుల పెంపకంలో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని పట్టు పరిశ్రమశాఖ ఏడీ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చంద్లాపూర్‌లో ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొత్తగా పట్టు సాగుచేసే పలువురు రైతులకు పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఇతర పంటలతో పోల్చితే పట్టు సాగు లాభదాయకమన్నారు. అంతకుముందు ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ రాఘవేందర్, పట్టు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కిష్టాపూర్‌లో మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ మాజీ సర్పంచ్ నారెడ్డి కమలవ్వ(65) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



చేర్యాల ఎస్టీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రిటైర్డ్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చేర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేర్యాల ఎస్టీవో కార్యాలయం ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎం.అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎస్టీవో కార్యాలయాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాండురంగం, యాదయ్య, ఎల్లారెడ్డి, రాంచందర్‌రావు, యశోద, రామబ్రహ్మం, సుదర్శనం, ఉదయ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● పశు వైద్యులు డాక్టర్ శ్వేత, వినయ్

జగదేవ్‌పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు డాక్టర్ శ్వేత, వినయ్ సూచించారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో బుధవారం పశువైద్య, పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించి మాట్లాడారు. పాడి పశువుల్లో వచ్చే గర్భాశయ, దూడల మరణాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 14 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 28 పశువులకు సాధారణ చికిత్సలు, ఆరు పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ భాస్కర్‌గౌడ్, ఓఎస్ హరిప్రసాద్, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మూలమహోత్సవం

వర్గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని విద్యాధరి క్షేత్రంలో బుధవారం సరస్వతీ ఆలయంలో మూలమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయంలో అమ్మవారికి వేదవిద్యార్థులు, భక్తులు లక్ష పుష్పార్చణ చేశారు. ఈ వేడుకలకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

● ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి రైతులను కోరారు. గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌యార్డు, బెజుగామ, బయ్యారం, బూర్గుపల్లి, దిలాల్‌పూర్, దాచారం, పిడిచెడ్, శేరిపల్లి, కొడకండ్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, పీఏసీఎస్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఆయనవెంట మునిసిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్, నాయకులు సుభాష్ చంద్రబోస్, నర్సింహారెడ్డి, మాధవరెడ్డి, వహీద్ ఉన్నారు.

●సిద్దిపేట రూరల్: సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి, రాఘవాపూర్, బండచేర్లపల్లి, రాంపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అన్నసారం పరమేష్‌గౌడ్, గ్యారా బాలవ్వ, మాజీ సర్పంచులు రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

●సిద్దిపేట అర్బన్: సిద్దిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సిద్దిపేట అర్బన్ మండల ఎన్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ నాగుల స్రవంతీప్రశాంత్, వైస్ ఎంపీపీ ఎల్లం ప్రారంభించారు.

●మిరుదొడ్డి: మిరుదొడ్డి మండలం ధర్మారం, మల్లుపల్లి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీవో పీడీ జయదేవ్‌ఆర్యా బుధవారం పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఏపీఎం దాకయ్య, ఏపీవో సుభాష్ తదితరులున్నారు.

●మర్కుక్: మండల పరిధిలోని దామరకుంట, మర్కుక్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బబ్బూరి మల్లేశంగౌడ్, కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షుడు తాండ కనకయ్యగౌడ్, మండల వ్యవసాయాధికారి నాగేందర్‌గౌడ్, కాంగ్రెస్ దామరకుంట, మర్కుక్ అధ్యక్షులు పత్తి నర్సింహులుయాదవ్, సాయిరెడ్డి జితేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.



సిద్దిపేట అర్బన్: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

ఏక్ ఫసల్..చెరువులకే ఎసరు

ఐదో పేజీ తరువాయి

మాఫీ చేయడంతో బ్యాంకు రుణాల కోసం ప్రభుత్వ భూముల రగ్గా కంటే ఎక్కువగా పట్టాదారులను సృష్టించారు. గ్రామాల్లో వీఆర్‌ఓలు చెరువుల శిఖంలో ఏక్‌ఫసల్ పట్టాలను, శిఖంలను కూడా పట్టాలుగా మార్చి, కాగితాలను సృష్టించారు. దుబ్బాకలోని నల్లచెరువుతోపాటు, చాలా చెరువుల్లో కొందరు వీఆర్‌ఓలు బ్యాంకు రుణాల కోసం పట్టాలను సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ధరణిలో కూడా పట్టాదారులుగా రావడంతో న్యాయపరమైన సమస్యలు వచ్చి, చెరువులను మింగేస్తున్నాయి.

సాంకేతికతను వినియోగించని ప్రభుత్వం

శాటిలైట్ ద్వారా ప్రతి ఇంచు ఎఫ్‌టీఎల్‌ను గుర్తించి, నీటినిల్వ ఎంతవరకు ఉంటుందనేది గుర్తించవచ్చు. జీహెచ్‌ఎంసీలో వినియోగించుకున్నట్టుగానే శాటిలైట్ విధానాన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉపయోగించడం ద్వారా చెరువుల ఉనికిని కాపాడొచ్చు. 16 ఏళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన ఈ సాంకేతికతను ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేయకపోవడం గమనార్హం.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి



బాల్‌రెడ్డికి క్రియాశీలక సభ్యత్వం అందజేస్తున్న మోహన్‌రెడ్డి

వర్గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డికి క్రియాశీలక సభ్యత్వం అందజేసి మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే గజ్వేల్ నంబరు వన్ స్థానంలో ఉందన్నారు. అదేవిధంగా క్రియాశీలక సభ్యత్వ నమోదులో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, బీజేపీ కుకునూరుపల్లి మండలాధ్యక్షుడు సంపత్‌రెడ్డి, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

మద్దూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాల కోఆపరేటివ్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ ఆలేటి యాదగిరి, ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులు ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లారన్నారు. కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే వచ్చారని, దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందని పరిస్థితి ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒక స్కూల్ అసిస్టెంట్‌తో పాటు ఇద్దరు ఎస్‌జీటీలను నియమించాలని కోరారు. వీరి వెంట బొడ్డు రవీందర్, ముస్త్యాల రవి, ఎండీ సాధిక్ ఉన్నారు.

'పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి'

సిద్దిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి జీవో 51ను సవరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. పంచాయతీ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ ప్రకటించిన విధంగీ జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బాల్‌నరసయ్య, జీపీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమురయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్ సాగులో మెళకువలు పాటించాలి'

సిద్దిపేట అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగులో రైతులు సరైన మెళకువలు పాటించి లబ్ధిపొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనాథ్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలలో ఆయిల్‌పామ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రఘురాములు, జక్కుల సిద్ధిరాములు, శ్రీహరి, సుధీర్‌రెడ్డి, మొర్రి చంద్రం, అనిల్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ జేఏసీ కార్యవర్గం ఎన్నిక

చేర్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. జేఏసీ కన్వీనర్లుగా తోకల ఉమారాణి, ఒగ్గు రాజు, రాజకీయ పార్టీల సంప్రదింపుల కమిటీ సమన్వయకర్తలుగా పుర్మ ఆగంరెడ్డి, అంకుగారి శశిధర్‌రెడ్డి, అందె బీరయ్య, గిరి కొండల్‌రెడ్డి, అధికార ప్రతినిధులుగా అందె అశోక్, గద్దల మహేందర్, ప్రజా, కుల సంఘాల సమన్వయకర్తలుగా మల్లిగారి యాదయ్య, బుట్టి సత్యనారాయణ, ఒరుగంటి శంకర్, బుట్టి భిక్షపతి, సుందరగిరి భాస్కర్ తదితరులు నియామకమైనట్లు చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ ప్రకటించారు.

హైటెన్షన్ విద్యుత్ స్తంభాల నిర్మాణం ఆపేయాలి



గ్రామస్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న రాందాస్‌గౌడ్

మర్కుక్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేష్‌పల్లిలో ఇళ్ల మధ్య నుంచి హైటెన్షన్ విద్యుత్ స్తంభాల నిర్మాణాలు చేపట్టడం తగదని వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్ అన్నారు. బుధవారం ఈ విషయమై గ్రామస్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామం మధ్యలో భారీ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు నిర్మాణం చేస్తే ప్రజలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. గ్రామం మధ్య నుంచి కాకుండా శివారు నుంచి ఏర్పాటు చేయాలని కోరారు.

మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మర్కుక్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మర్కుక్‌కు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. వరికోతలు ప్రారంభమై చాలారోజులైనా ఇప్పుడిప్పుడే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా.. అవి మొక్కుబడిగానే కొనసాగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో గజ్వేల్ నియోజకవర్గంలో 111 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి అన్ని కేంద్రాలకు మిషనరీతో పాటు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచి పర్యవేక్షించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ప్రాణాలతో కాంగ్రెస్ చెలగాటం'

గజ్వేల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల ప్రాణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురుకులాల్లో జరుగుతున్న వరుస సంఘటనలతో పిల్లలను చదివించాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనేక గురుకులాలను ప్రారంభిస్తే వాటిని సమస్యల కూపంలోకి ఈ ప్రభుత్వం నెడుతుందన్నారు. వెంటనే ముఖ్యమంత్రి గురుకులాల సమస్యలపై సమీక్ష నిర్వహించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.